
క్లుప్తంగా

రాధారంగా మిత్రమండలి చైర్మన్‌గా సుబ్రహ్మణ్యం


చైర్మన్‌గా నియమితులైన తొంటా సుబ్రహ్మణ్యం

కొయ్యలగూడెం : రాధా రంగ మిత్రమండలి పోలవరం నియోజకవర్గ అధ్యక్షుడిగా బయ్యనగూడెం గ్రామానికి చెందిన తొంట సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్ర, తెలంగాణ రాధా మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పన్నాస పూర్ణచంద్రరావు నియామక పత్రాన్ని అందించినట్లు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు.

శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ


ఆలయంలో ప్రతిష్ఠించిన కృష్ణుని విగ్రహం

ద్వారకాతిరుమల : జి.కొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన కృష్ణాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ పురోహితులు గర్భాలయంలో కృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భారీ అన్నసమారాధనను జరిపారు. ఈ వేడుకలో పెద్ద ఎత్తున గ్రామస్తులు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అంకమ్మ తల్లి సన్నిధిలో...


అంకమ్మ తల్లిని దర్శించిన ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి : ప్రగడవరంలో వేంచేసి ఉన్న శ్రీదేవి అంకమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా శుక్రవారం దర్శించుకున్నారు. ప్రస్తుతం గ్రామంలో అంకమ్మ తిరునాళ్లు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే ఎలీజా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఎస్.రమేష్‌రెడ్డి, అలవాలబాబు, నరశింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, ఎస్ కాంతారావు, యడ్ల మోహన్ రావు తదితరులు ఉన్నారు.

మోటార్‌సైకిల్ చోరీపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : మోటార్‌సైకిల్ చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. గత నెల 13వ తేదీన ఏపుగుంటకు చెందిన ఎస్.కిషోర్ జంగారెడ్డిగూడెం సంగీత మొబైల్ షాప్ వద్ద తన మోటార్‌సైకిల్‌ను పార్క్ చేసి షాపులో పని ముగించుకుని తిరిగి వచ్చి చూడగా మోటార్‌సైకిల్ కనిపించలేదు. అప్పటి నుంచి మోటార్‌సైకిల్ కోసం వెదికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

నూకాలమ్మను దర్శించిన గరిమెళ్ల వెంకటరమణశాస్త్రి


అమ్మవారిని దర్శించుకున్న గరిమెళ్ల

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని శ్రీ చక్ర సహిత శ్రీనూకాలమ్మ ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, రామలక్ష్మి దంపతులు విశేష పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు జరిపారు. అమ్మవారిని వీరంపాలెం శ్రీ బాలా త్రిపురసుందరి పీఠాధిపతులు శ్రీ గరిమెళ్ల వెంకటరమణశాస్త్రి దర్శించుకున్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు, శ్రీనూకాంబిక సేవ బృందం సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

రూ.30.37 లక్షలకు వేలం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీకి సంబంధించి వారపుసంత, డైలీమార్కెట్ ఆశీల బహిరంగ వేలం శుక్రవారం నిర్వహించినట్లు కమిషనర్ పి.భవానీ ప్రసాద్ తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను రోజువారీ మార్కెట్, వారపు సంతమార్కెట్‌ను గంధ్రోతు బాల వెంకటేష్ రూ. 30.37 లక్షలకు పాడుకున్నట్లు కమిషనర్ తెలిపారు. కౌన్సిల్ ఆమోదం మేరకు పాటను ఖాయపర్చామన్నారు. మొత్తం ఆరుగురు వ్యక్తులు ఈ బహిరంగ వేలంలో పాల్గొన్నట్లు చెప్పారు. కాగా కబేళా వేలంకు ఒక పాటదారుడు మాత్రమే పాల్గొనడంతో వేలాన్ని వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ మేనేజర్, రెవెన్యూ ఆఫీసర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ అభివృద్ధికి కృషి


చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాను కలిసి కృతజ్ఞతలు తెలుపుతూ సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీల సభ్యులు, నాయకులు


పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజును కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీల సభ్యులు, పార్టీ నాయకులు

జంగారెడ్డిగూడెం : చింతలపూడి, పోలవరం ఎమ్మెల్యేలను ఇటీవల నూతనంగా నియమితులైన వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీల సభ్యులు శుక్రవారం జంగారెడ్డిగూడెంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తమ నియామకానికి కృషిచేసిన ఎమ్మెల్యేలకు వారు కృతజ్ఞతలు తెలుపుతూ సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు అప్పగించిన బాధ్యతను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించి, పార్టీ అభివృద్ధికి కృషిచేస్తామని ఎమ్మెల్యేలకు తెలిపారు. ఎమ్మెల్యేలు వీఆర్ ఎలీజా, తెల్లం బాలరాజులను కలిసిన వారిలో ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షులు పడమటి గిరిబాబు, మహిళా విభాగం అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ, ప్రచార విభాగ అధ్యక్షులు పోల్నాటి బాబ్జి, బీసీ సెల్ అధ్యక్షులు గంట ప్రసాదరావు, ఎస్ఎస్ఎల్ అధ్యక్షులు టి.ఆనంద్, మైనార్టీ సెల్ అధ్యక్షులు రాజా అహ్మద్, ఎస్టీ సెల్ అధ్యక్షులు కోవాడ నారాయణ, వైఎస్సార్ టీయూ పాలడుగుల మురళి శ్యామ్, పంచాయతీరాజ్ అధ్యక్షులు ఉప్పల గోపి దుర్గా రాజేంద్రప్రసాద్, చేనేత విభాగం అధ్యక్షులు దొంతంశెట్టి సత్యనారాయణలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వీరితో పాటు జంగారెడ్డిగూడెం మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షులు పీపీఎన్ చంద్రరావు, కౌన్సిలర్ నేకూరి కిషోర్, సొసైటీ డైరెక్టర్ చిప్పాడ వెంకన్న, పంది రాజా, గంజి వినోద్ తదితరులు ఉన్నారు.

ఘనంగా విజయదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ


విశేషా అలంకరణలో శ్రీ విజయదుర్గ అమ్మవారు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని పాత ఆంధ్రా బ్యాంక్ వీధిలో నూతనంగా నిర్మించిన శ్రీవిజయదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వీరంపాలెం శ్రీబాలాత్రిపురసుందరీ పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ళ వెంకట రమణశాస్త్రి, కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠం విశ్రాంత ప్రధానాధికారి దోర్బల ప్రభాకరశర్మ పర్యవేక్షణలో శ్రీవిజయదుర్గ అమ్మవారితో పాటు పంచభూత మరకత లింగేశ్వరస్వామి, తొమ్మిది దేవతామూర్తుల ప్రతిష్ఠ నిర్వహించారు. ప్రథమ దర్శనం గుంటూరు జిల్లా తాళ్లాయపాలెం శ్రీశైవక్షేత్రం పీఠాధిపతి శ్రీశివస్వామి దర్శించిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, నాయకులు, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు. కాగా బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు తపన చౌదరి ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందజేశారు. అమ్మవారిని స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజినల్ చైర్మన్ వందనపు సాయి బాలపద్మ, వెంకటేశ్వరరావు దంపతులు, నూకాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, వెంకట రామలక్ష్మి దంపతులు, పూర్వ మున్సిపల్ చైర్మన్ బంగారు శివలక్ష్మి, సూర్యనారాయణ దంపతులు, కొప్పాక శ్రీనివాసరావు, పట్టణ ప్రముఖులు, దర్శించుకున్నారు. కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామమోహనరావు, పీఠం ఆధ్యాత్మిక సేవా ప్రతినిధి ఈమని శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మదన గోపాలస్వామి తిరు కల్యాణోత్సవాలు


మదనగోపాల స్వామికి తిరు కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాల స్వామి వారి తిరు కల్యాణోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. విగ్రహాల పునః ప్రతిష్ఠ, ఆలయ నిర్మాణ ప్రారంభోత్సవం అనంతరం చేపట్టిన తిరు కల్యాణోత్సవాలలో భాగంగా అర్చకులు శ్రీనివాసుల శేషాచార్యులు, గుడిపూడి వెంకట రామా శేషాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. పాలకమండలి కమిటీ చైర్మన్ మద్దు గోపి దంపతులు కల్యాణ తంతును శాస్త్రోక్తంగా జరిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా తాండ్ర సందీప్

ద్వారకాతిరుమల: బీజేపీ నూతన మండల అధ్యక్షుడిగా కోడిగూడెంకు చెందిన తాండ్ర సందీప్‌ను ఆ పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు బొమ్ముల దత్తు ఆదేశాల మేరకు శుక్రవారం నియమించారు. పార్టీ నేతలు ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం సందీప్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

చింతలపూడి అభివృద్ధికి చర్యలు


మేడవరపు చెరువును పరిశీలిస్తున్న నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

చింతలపూడి : చింతలపూడి పట్టణ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు నూజివీడు సబ్ కలెక్టర్, నగర పంచాయతీ ప్రత్యేక అధికారి ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. మండలంలోని సాగునీటి చెరువులతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని సచివాలయ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పట్టణాభివృద్ధిలో భాగంగా పబ్లిక్ టాయిలెట్లు, పార్క్, పాత బస్టాండ్ సెంటర్‌లో ప్రయాణీకుల సౌకర్యార్థం సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు రూపొందించినట్లు ఆయన చెప్పారు. పట్టణాన్ని స్వచ్ఛ చింతలపూడిగా మార్చడంతో పాటు పట్టణ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట తహసీల్దార్ కృష్ణజ్యోతి, నగర పంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

శింగగూడెంలో చెరువుల ఆక్రమణల తొలగింపు


శింగగూడెంలో చెరువు ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టిన అధికారులు

లింగపాలెం : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చెరువుల ఆక్రమణదారులు స్వచ్ఛందంగా భూముల నుంచి వైదొలగాలని తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ ఆశీర్వాదం కోరారు. శింగగూడెం గ్రామంలో చెరువు ఆక్రమణలకు గురైన భూములను శుక్రవారం పంచాయతీ రాజ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు పరిశీలించి, ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కోర్టు అదేశాల మేరకు ఆయాగ్రామాల్లోని చెరువు ఆక్రమణదారులకు ముందుగా నోటీసులు అందజేస్తామన్నారు. అయినా ఆక్రమణదారులు భూముల నుంచి వైదొలగకపోతే తామే ఆక్రమణలను తొలగించి ఆ భూములను ప్రభుత్వానికి అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ జేఎం రత్నకుమార్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

జంగారెడ్డిగూడెం రూరల్ : మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తోందని, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ కేవీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని వేగవరం నోవా కళాశాలలో మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, చదువుల్లో రాణిస్తూ తల్లితండ్రుల కోరుకుంటున్న బంగారు భవిష్యత్తు దిశగా యువత పయనించాలన్నారు. రానున్న 3 నెలల్లో మాదక ద్రవ్యాలు లేకుండా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఎక్కడైనా మత్తుపదార్థాలు అమ్మినా, సేవించినా టోల్ ఫ్రీ నెంబర్ 14500 , లేదా దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషనకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సీఐ బాలా సురేష్, ఎస్సై సాగర్‌బాబు, నోవా కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కృత పాఠశాల ఏర్పాటుకు కృషి చేయాలి


బ్రహ్మశ్రీ దోర్బల ప్రభాకర శర్మను సన్మానిస్తున్న ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ సభ్యులు

జంగారెడ్డిగూడెం : ఏజెన్సీ మెట్ట ప్రాంతమైన జంగారెడ్డిగూడెంలో సంస్కృత పాఠశాల ఏర్పాటుకు అందరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ దేవదాయ ధర్మాదాయ సంస్కృత శాస్త్ర ఆగమ సలహాదారు, మహామహోపాధ్యాయ, ప్రవచన బ్రహ్మ బ్రహ్మశ్రీ దోర్బల ప్రభాకర శర్మ పిలుపునిచ్చారు. పట్టణంలోని శ్రీ విజయదుర్గ అమ్మవారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను శుక్రవారం స్థానిక ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ సభ్యులు సన్మానించారు. అధ్యక్షుడు చిలుకూరి సాయి బాబు నివాసం వద్ద సభ్యులు ప్రభాకర శర్మకు పూలమాల వేసి, దుశ్శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి కూచిభట్ల రాము, పూర్వ అధ్యక్షుడు కుందా రామశాస్త్రి, మీడియా సలహాదారు లంకా నాగకుమార్, మహిళా కార్యవర్గ సభ్యురాలు మదనంబెడు కృష్ణప్రియ, చిలుకూరి లక్ష్మి, రెవెన్యూ సలహాదారు సమయమంత్రి రాధాకృష్ణ, గౌరవ సలహాదారు తిప్పబొట్ల రామకృష్ణ, మల్లాది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ అజ్ఞాని నాదెండ్ల


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొయ్యలగూడెం : జనసేన పార్టీ నాయకుడు నాదెండ్ల మనోహర్ రాజకీయ అజ్ఞాని అని, పరిణితి లేని మాటలు అనడంలో దత్తపుత్రుడికి తగిన ఉత్తర కుమారుడని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి శుక్రవారం పేర్కొన్నారు. రాష్ట్రంలో 175 స్థానాలలో పోటీ చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్న మాటలను ఉదహరిస్తూ జగన్ పొరుగు రాష్ట్రాలలో అభ్యర్థులను నిలబెట్టే దమ్ము ఉందా అని అనడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహానేత ఆశయాల మేరకు రాష్ట్ర అభివృద్ధికి ఏర్పడిందే కానీ ఇక్కడ కాకపోతే అక్కడ అంటూ పొరుగు రాష్ట్రాలలో పాగా వేయాలనుకునే ప్రతిపక్షాల మాదిరి తమది రెండు పడవల సిద్ధాంతం కాదని అన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి గంగరాజు మాట్లాడుతూ కేవలం లోకేష్ పాదయాత్రను భూతద్దంలో చూపించడానికి వారాహి వాహన యాత్ర పక్కన పెట్టి జనసేన అధినేత భారీ ప్యాకేజీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లింగిశెట్టి అనంతలక్ష్మి, ఏలేటి చిన్నతుక్కయ్య, ఉప సర్పంచ్ కోరుకొండ లలిత, పార్టీ నాయకులు తోట జయ బాబు, కర్రేడ్ల ధర్మ రాజు, పాముల నాగమునిస్వామి, పాలి నాని మందపాటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలరాజుకు ఎమ్మెల్యే ఎలీజా పరామర్శ


ఎమ్మెల్యే బాలరాజును పరామర్శించిన ఎమ్మెల్యే ఎలీజా

బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం : ఇటీవల గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొంది, ప్రస్తుతం జంగారెడ్డిగూడెంలో విశ్రాంతి పొందుతున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజును చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా శుక్రవారం పరామర్శించారు. జంగారెడ్డిగూడెంలోని బాలరాజు నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచించిన విధంగా జాగ్రత్తలు పాటిస్తూ బాలరాజు పూర్తి ఆరోగ్యంతో ప్రజా క్షేత్రంలో అడుగుపెట్టాలని వీఆర్ ఎలీజా ఆకాంక్షించారు.

ధైర్యాన్ని, నిజాన్ని అడ్డుకోలేవు


వందనపు సాయి బాల పద్మ

జంగారెడ్డిగూడెం : ఎల్లో మీడియా ఎన్ని అసత్యవంటలు వండినా ధైర్యాన్ని, నిజాన్ని అడ్డుకోలేవని విశాఖ సమ్మిట్ నిరూపించిందని ఐసీడీఎస్ రీజనల్ చైర్‌పర్సన్, ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ అన్నారు. విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ విజయవంతంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఈ విజయం పూర్తిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. టీడీపీ కోసం ఎల్లో మీడియా ఎంత అసత్య ప్రచారం చేసినా, గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో ఔత్సాహికులను మాత్రం ప్రభావితం చేయలేకపోయారన్నారు. సుమారు రూ.13 లక్షల కోట్ల పెట్టుబడితో గ్లోబల్ సమ్మిట్ నిర్ణయాలు జరిగాయంటేనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీద ఉన్న నమ్మకం ఏమిటో అర్థమవుతోందని, ఈ విజయం ఖచ్చితంగా ప్రతిపక్షానికి చెంపపెట్టు అని ఆమె పేర్కొన్నారు. ఈ సమ్మిట్ విజయవంతంతో సుమారు 6 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయన్నారు.

ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం

చింతలపూడి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జంతు శాస్త్ర శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి శ్రీనివాసరావు మాట్లాడుతూ వన్యప్రాణులు, మొక్కలు అంతరించిపోవడానికి సిద్ధంగా ఉన్న జాతులను మానవుడు ఏ విధంగా సంరక్షించుకోవాలో వారి అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. కార్యక్రమంలో జంతు శాఖ అధిపతి కె.రత్నకుమారి, జంతు శాస్త్ర అధ్యాపకులు బి.వెంకటేశ్వరరావు, భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు జీవన మౌనిక, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాలలో...

జంగారెడ్డిగూడెం : స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ వన్య ప్రాణుల దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ వన్య ప్రాణులను సంరక్షించడం మన అందరి ధర్మం అన్నారు. ప్రకృతికి, మానవునికి విడదీయరాని బంధం ఉందని మానవులకు భూత దయ ఉండాలి అన్నారు. వన్య ప్రాణుల రక్షణ మన రాజ్యాంగంలో ప్రాథమిక విధులలో ముఖ్యమైన అంశము అన్నారు. కళాశాల జువాలజీ లెక్చరర్ విజయ దీపిక మాట్లాడారు. జువాలజీ విద్యార్థులు వన్యమృగ సంరక్షణ ఏ విధంగా చేయాలో తెలిపే పోస్టర్లను ప్రదర్శించారు.

భూముల రీసర్వే పరిశీలన


కంద్రికగూడెంలో భూముల సరిహద్దు సర్వే రాళ్లను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ

బుట్టాయగూడెం : మండలంలోని కంద్రికగూడెం, రావిగూడెం గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వే పనులను జంగారెడ్డిగూడెం ఆర్‌డీఓ ఎం.ఝాన్సీరాణి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టోన్ ప్లాంటేషన్ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయన్నారు. దీనిలో భాగంగా గ్రామ సరిహద్దుల్లోని రాళ్ల ఏర్పాటును పరిశీలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.శారాశాంతి, సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేయాలి


సొంగావారిగూడెం పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈవో రామారావు

లింగపాలెం : విద్యార్థుల విద్యాప్రమాణాలు మరింతగా పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో కె.రామారావు అన్నారు. కె.గోకవరం శివారు సొంగావారిగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈమేరకు పాఠశాల రికార్డులు, నాడు–నేడు పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంను రుచిచూశారు. అనంతరం విద్యార్థుల విద్యాప్రమాణాలను తరగతుల వారీగా, సబ్జెక్టుల వారీగా పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం కుమార్, తనిఖీ ప్యానల్ మెంబర్లు టి.వెంకటరత్నం, టి.కనకరాజు, జి.కుమార్ మంగళం, టి సునీత, ఎక్కౌంటెంట్ యాసీన్, ఉపాధ్యాయులు తనగాల మురళీ పాల్గొన్నారు.

96 శాతానికి చేరిన పింఛన్ల పంపిణీ


పింఛన్ అందజేస్తున్న వలంటీర్, సచివాలయం కన్వీనర్లు

కొయ్యలగూడెం : పింఛన్ల పంపిణీ మూడవరోజు శుక్రవారం కూడా మండల వ్యాప్తంగా నిర్వహించారు. వలంటీర్లతో కలిసి సచివాలయ కన్వీనర్లు లబ్ధిదారులకు పింఛన్ సొమ్ములను అందజేశారు. 96శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని జగనన్న సచివాలయ మండల కోఆర్డినేటర్ నూకల రాము తెలిపారు. సచివాలయ కన్వీనర్లు పాల్గొనేలా పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తున్నామన్నారు.

వినూత్న రీతిలో నిరసన


ర్యాలీచేస్తున్న సీపీఎం నాయకులు

బుట్టాయగూడెం : పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని కోరుతూ స్థానిక బస్టాండ్ సమీపంలో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ నేడు సామాన్య ప్రజలకు గ్యాస్ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించుకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం వినూత్నరీతిలో బుట్టాయగూడెంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, సభ్యులు ఉడతా వెంకటేశ్వరరావు, తామా ముత్యాలమ్మ, నాగమణి, మంగరాజు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి


బార్ అసోసియేషన్ సభ్యులతో చర్చిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి వరలక్ష్మి

జంగారెడ్డిగూడెం : లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంతో సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందని జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి అన్నారు. పట్టణంలోని న్యాయస్థానాల ప్రాంగణంలో శుక్రవారం బార్ అసోసియేషన్ సభ్యులతో జడ్జి వరలక్ష్మి సమావేశమాయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 18న న్యాయస్థానాల ప్రాంగణంలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కుటుంబ తగాదాలు, మనోవర్తి, గృహహింస, 498/ఏ కేసులను పరిష్కరించుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టీఎస్ఎన్ మూర్తి, న్యాయవాదులు పాల్గొన్నారు.

వైద్యుడు రామప్రసాద్ మృతి


డాక్టర్ చెరుకూరి రామప్రసాద్(72)

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని ప్రముఖ వైద్యుడు, ఈఎన్‌టీ స్పెషలిస్ట్, డాక్టర్ చెరుకూరి రామప్రసాద్(72) గురువారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. శుక్రవారం పట్టణ ప్రముఖులతో పాటు ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు వజ్రకిరణ్, కె.రామచంద్రబాబు, పలువురు వైద్యులు రామప్రసాద్ నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.